



రెట్టింపు ధరకు పామాయిల్!

● హాస్టళ్లకు సరఫరా చేసిన పౌరసరఫరాల సంస్థ
● ఆ భారాన్ని భరించలేమంటున్న వార్డెన్లు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 6: బయట మార్కెట్‌లో పామాయిల్ ధర 85 రూపాయలు. వసతి గృహాలకు పౌరసరఫరాల సంస్థ సరఫరా చేసినందుకు నిర్ణయించిన ధర 157 రూపాయలు. ఒక లీటరు ప్యాకెట్‌పై రూ.72 అధికంగా ఉంది. ఇంతటి భారాన్ని మోయలేమని సంక్షేమశాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో ఉండి చదవుకునే విద్యార్థులకు ఆయా సంక్షేమశాఖల అధికారులు భోజనం తయారు చేయిస్తారు. దీనికిగాను ప్రభుత్వం బియ్యం సరఫరా చేస్తుంది. మిగిలిన సరుకులను వార్డెన్లు మార్కెట్‌లో కొనుగోలు చేస్తుంటారు. దీనికోసం ముందుగా వార్డెన్లు పెట్టుబడి పెట్టాలి. ఆ తర్వాత ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేస్తుంది. ఈ క్రమంలో ఎం.ఎల్. పాయింట్లలో నిల్వ ఉన్న పామాయిల్ ప్యాకెట్లను వసతిగృహాలకు గతనెలలో అందజేశారు. అంగన్వాడీ కేంద్రాలకు ఇచ్చే పామాయిల్‌నే సంక్షేమగృహాలకు కూడా ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ లీటరు ప్యాకెట్‌కు పౌరసరఫరాల సంస్థ రూ.157గా ధర నిర్ణయించింది. జిల్లాలో 25 బీసీ, 53 ఎస్సీ, 11 గిరిజన సంక్షేమ వసతి గృహాలకు సుమారు మూడు వేల లీటర్ల పామాయిల్ ప్యాకెట్లను అందజేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటికి రూ.157 లెక్కన చెల్లించాల్సి రావడంపై వార్డెన్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ధర మా నిర్ణయం కాదు

వసతిగృహాలకు పామాయిల్ సరఫరా చేసే నిర్ణయం రాష్ట్రస్థాయిలో ఉన్నత అధికారులు తీసుకున్నది. ధర వారే నిర్ణయించారు. జిల్లాస్థాయిలో ధర నిర్ణయించడం లేదు. ఎం.ఎల్. పాయింట్లలో నిల్వవున్న పామాయిల్ ప్యాకెట్లను హాస్టళ్లకు సరఫరా చేసేంతవరకే మా బాధ్యత.

- మోహన్‌బాబు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, చిత్తూరు.



● తిరుపతి, చిత్తూరు, మదనపల్లెలో... నేడే ముగ్గుల పోటీలు

తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సంక్రాంతిని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను ఈసారి ఆదివారం తిరుపతి, చిత్తూరు, మదనపల్లె పట్టణాల్లో నిర్వహిస్తోంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులపోటీలు..రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన, ఎయిమ్ ఇనిస్టిట్యూట్స్ సౌజన్యంతో మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. తిరుపతి నగరంలో ఇందిరా మైదానం(తుడా మైదానం), చిత్తూరులో ఎన్‌పీసీ పెవిలియన్ కల్యాణ మండపం (నాయుడు బిల్డింగ్స్, విజయ డిగ్రీ కాలేజీ దగ్గర), మదనపల్లెలో జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున వరుసగా మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపిక కాబడిన ఇద్దరు, మొత్తం 15 మందికి విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. తిరుపతిలో జరిగే పోటీలకు సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్, చిత్తూరులో జరిగే పోటీలకు విజయం విద్యాసంస్థలు, మదనపల్లెలో జరిగే పోటీలకు శ్రీనివాస డిగ్రీ కాలేజ్, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



జయహో బీసీ వాహనాలను ప్రారంభిస్తున్న పులివర్తి నాని



నీటితో కళకళలాడుతున్న బుడమాల చెరువు

గుడి పేరిట చెరువు స్థలం కబ్జా



కబ్జా చేసిన చెరువు స్థలంలో ఇటీవల చేపట్టిన నిర్మాణం

● అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నేత దుశ్చర్య
● ఇప్పటికే 0.75 ఎకరాల చదును
● అడుగు రూ.1000 నుంచి రూ.1500 ధర

ఇప్పటికే కొండలు, గుట్టలు, వాగులు, డీకేటీ భూములను కబ్జా చేసిన అధికార పార్టీ నేతలు... ఇప్పుడు చెరువుపై పడ్డారు. గుడి పేరుతో చెరువు స్థలాన్ని కబ్జా చేయడానికి వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చెరువు భూమిని చదును చేయడానికి ఎవరు పట్టాలిచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పట్టించుకోవాల్సిన రెవెన్యూ అధికారుల్లో కొందరు ఇందులో భాగస్వాములన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- చిత్తూరు

జిల్లా కేంద్రమైన చిత్తూరు రోజు రోజుకు విస్తరిస్తోంది. దానికనుగుణంగా ఇళ్ల స్థలాల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. అదే సమయంలో ప్రభుత్వ స్థలం కనిపిస్తే పాగా వేయడానికి అధికార పార్టీ నేతల్లో కొందరు స్కెచ్ వేశారు. ఇప్పటికే ప్రశాంత్‌నగర్, వైఎస్సార్ నగర్, బోడికొండ తదితర ప్రాంతాల్లో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి. రకరకాల సంస్థలు, యూనియన్ల పేర్లతో ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకుంటారు. అధికార పార్టీ నేతల ద్వారా ఉన్నతాధికారులకు ఫోన్లు చేయించి పట్టాలు తీసుకుంటారు. రోజుల వ్యవధిలోనే ఈ స్థలాన్ని ప్లాట్లుగా వేసి అమ్ముకుంటారు. ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. తాజాగా మంగసముద్రం రెవెన్యూ ధాఖలాలోని సర్వే నెంబరు 413, 414 లలో 16.50 ఎకరాల బుడమాల చెరువు ఉంది. ఈ చెరువు రోడ్డును ఆనుకుని ఉండటంతో అడుగ ధర రూ.1000 నుంచి రూ.1500 వరకు పలుకుతుంది. చెరువు మధ్యలో నీరు ఉండగా చివర్లో మిట్టగా ఉంది. ఈ స్థలంపై అధికార పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకుడితోపాటు మరికొందరు కన్నేశారు. రెండు నెలలుగా 0.75 ఎకరాల స్థలాన్ని చదును చేశారు. చెరువు స్థలాన్ని ఎందుకు చదును చేస్తున్నారని అడిగి వారికి గుడి కట్టడానికని సమాధానం చెబుతున్నారు. చెరువులో గుడి కట్టడానికి ఎవరు అనుమతిచ్చారో తెలియడం లేదు.

కబ్జా చేసి ఆపై ప్లాట్లుగా మార్చి..!

అధికార పార్టీకి చెందిన ఆ నాయకుడు, మరికొంత మంది అధికార పార్టీ చెందిన ప్రజాప్రతినిధులతో సఖ్యతగా ఉంటాడు. వారంతా తనకు తెలుసంటూ స్థానికుల వద్ద గొప్పలు చెబుతాడు. దాంతో ఆయన చెరువు స్థలాన్ని కబ్జా చేస్తున్నా స్థానికంగా ఎవరూ అధికారులకు ఫిర్యాదు చేసే సాహసం చేయలేదు. గుడి పేరిట స్థలాన్ని చదును చేసి కబ్జా చేసిన అనంతరం చుట్టూ ప్రహరీ నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. యథాప్రకారం కొన్ని రోజుల తరువాత ప్లాట్లుగా మార్చి అమ్ముకునేందుకే ఈ తరహా ప్లాన్ వేశాడని సమాచారం.

నిద్రలో రెవెన్యూ యంత్రాంగం?

రెవెన్యూ విభాగంలో తలారీరి నుంచి వీఆర్వో, సెక్రటరీలతో పాటు ఇప్పుడు సచివాలయ వ్యవస్థ కూడా అందుబాటులో ఉంది. డివిజన్ పరిధిలో ప్రభుత్వ స్థలాలను కాపాడటంతోపాటు ఆక్రమణలకు గురైన వాటిని ఆపడం, కబ్జాదారులు వినకపోతే పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిరక్షించడం వీరి విధుల్లో భాగం. అయితే నగరంలో మాత్రం కబ్జాదారులకు రెవెన్యూ అధికారులే సహాయ సహకారాలు అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువైన చెరువు భూమిని చదును చేసి ఆక్రమించుకోవడానికి పనులు జరుగుతుంటే స్థానిక యంత్రాంగం ఏం చేస్తుందో తెలియడం లేదని కాలనీవాసులు అంటున్నారు. భూగర్భ జలమట్టం పెరగడంతోపాటు సాగు, తాగునీటి అవసరాలు తీర్చడానికి ఉన్న చెరువు ఆక్రమణలకు గురికాకముందే రెవెన్యూ యంత్రాంగం మేల్కోవలసి ఉంది.

19న జిల్లాలో 'రా.. కదలిరా' సభ

● టీడీపీ అధినేత చంద్రబాబు హాజరవుతారన్న నాని

చిత్తూరు సిటీ, జనవరి 6: జిల్లాలో ఈ నెల 19వ తేది టీడీపీ 'రా... కదలిరా' బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చిత్తూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని చెప్పారు. చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రా..కదలిరా' కార్యక్రమం ద్వారా టీడీపీ మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్య పరుస్తామన్నారు. దీని కోసం 19వ తేదీన జిల్లాలో చంద్రబాబు బహిరంగ సభ ఉంటుందన్నారు. బహిరంగ సభ స్థలాన్ని త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికీ నీరు, పూర్ టు రిచ్, బీసీ రక్షణ చట్టం పథకాలను పటిష్ఠంగా అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పేర్కొన్నారు. ఈ పథకాల ద్వారా ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.1.5 లక్షల లబ్ధి చేకూరుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ కోరారు. నా బీసీలు, నాఎస్సీలు, నాఎస్టీలు అని చెప్పుకునే సీఎం జగన్ వారిని ఎక్కడికక్కడ అణగదొక్కుతున్నారని జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ విమర్శించారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం పార్టీ ఆవరణలో 'జయహో బీసీ' వాహనాలను పులివర్తి నాని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చెన్నకేశవులు నాయుడు, త్యాగరాజన్, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, నౌషాద్, ఫైరోజ్, శశికర్ బాబు, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

3,998 మందికే రేషన్‌కార్డులు

● మిగిలిన 13వేల మందికి నిరీక్షణే

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 6: అర్హులందరికీ రేషన్ కార్డులిస్తాం. దరఖాస్తు చేసుకోండి. ఎవరికీ అన్యాయం చేయం.. ప్రతి జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రులు తరచూ చెప్పిన మాటలివీ. కానీ, చివరకు ఇచ్చింది మాత్రం కొందరికే. ప్రస్తుతం జిల్లాలో 5,41,703 రేషన్‌కార్డులు ఉండగా, కొత్త కార్డుల కోసం 16,655 మంది దరఖాస్తు చేశారు. వీరంతా కొత్తకార్డుల కోసం ఆరునెలలుగా నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ అంటూ నిబంధనలు పెట్టి కోతలు పెట్టింది. ఫలితంగా.. దరఖాస్తు చేసుకున్న 16,655 మందికిగాను 3998 మందికే ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం జేసీ శ్రీనివాసులు ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాకు 3998 కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, వీరికి జనవరి నెలలో బియ్యం ఇస్తామని తెలిపారు. కీ రిజిస్టర్‌లో కొత్తకార్డుల వివరాలు నమోదవుతున్నాయని, కార్డులను ఆయా సచివాలయాల వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కాగా, ఇంకా కార్డుల కోసం 12,657 మంది నిరీక్షిస్తున్నారు. వీరందరూ జూలై వరకు వేచివుండాల్సిందే. అప్పటికి వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

పనులు పూర్తికాకనే..!

● హంద్రీ- నీవా కాలువలో నీటిని పారించేయత్నం
● అడుగడుగునా అవాంతరాలు

వి.కోట, జనవరి 6: కాలువ పనులు ఇంకా పూర్తి కాలేదు. పేలుళ్లతో బండరాళ్లను కొట్టిన చోట కాంక్రీటు పనులు చేయలేదు. అయినా, కుప్పానికి హంద్రీ నీవా నీళ్లిచ్చేశామని చెప్పుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. దీనికోసం హడావిడిగా నీటిని పారించేందుకు ప్రయత్నిస్తోంది. చిత్తశుద్ధి లేని ఈ పనులకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయన్న విమర్శలున్నాయి. వారం కిందట బైరెడ్డిపల్లె మండలం నుంచి కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు నీటిని వదిలేందుకు పంప్ చేస్తున్నారు. కైగల్ ఏరుకు పైనుంచి పైపుల ద్వారా శ్రీకార్లపల్లె వరకు నీళ్లు చేరాయి. అక్కడ్నుంచి కృష్ణాపురం పంచాయతీ మోట్లపల్లె వద్ద ఉన్న లిఫ్ట్‌హౌస్ వరకు నీళ్లు చేరాయి. లిఫ్ట్‌హౌస్ వద్ద పూర్తి సామర్థ్యంతో మోటార్లు పనిచేయాలంటే వస్తున్న నీళ్లు చాలని పరిస్థితి. దీంతో అధికారులు ఒక మోటారు ద్వారా మాత్రమే నీటిని పంప్ చేస్తున్నారు. ఒక మోటారుతో నీటిని పంప్ చేసి కాలువలో వదలగా.. అవి ఇంకిపోతూ.. ముందుకు సాగడం లేదు. వారం రోజులుగా కష్టపడి నీటిని నెర్నపల్లె వద్ద ఉన్న హంద్రీ-నీవా కాల్వ వరకు తీసుకురాగలిగారు. అక్కడ కాలువల పనుల్లో బండరాళ్లు రావడంతో వాటిని బ్లాస్టింగ్ ద్వారా పెకలించారు. ఈ క్రమంలో కాలువ ద్వారా వచ్చే నీళ్లు బండరాళ్ల మధ్య నుంచి ఇంకిపోతుండగా.. మరో వైపు కాలువ నుంచి బయటకు పోతున్నాయి. ఇలా నీళ్లు బయటకు పోయే ప్రాంతాల్లో ఎక్స్‌కవేటర్ ద్వారా మట్టితో పూడుస్తున్నారు. ఇలా ఒకవైపు పనులు చేస్తుంటే.. మరో వైపు నీరు కాలువలోనే ఇంకి పోతుండటంతో ఎలా ముందుకు సాగించాలో అంతుపట్టక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కృష్ణాపురం వద్ద లిఫ్టింగుకు అన్ని మోటార్లు పనిచేస్తేనే నీళ్లు ముందుకు సాగతాయని అధికారులు అభిప్రాయానికి వచ్చారు. పాలకులు చిత్తశుద్ధితో వందశాతం కాలువ పనులు పూర్తిచేసి నీటిని లిఫ్ట్ చేయకుండా.. కేవలం కుప్పానికి నీళ్లిచ్చామని చెప్పుకొనేందుకు చేస్తున్న చర్యలపై స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.




కృష్ణాపురం లిఫ్టు వద్ద కాలువలో అందీ అందకుండా ఉన్న నీళ్లు - నెర్నపల్లె వద్ద ఎక్స్‌కవేటర్‌తో కాలువ పనులు



నగరిలో మేకకు వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

నమ్మి మోసపోయాం

నెత్తిన గుడ్డేసుకుని అంగన్వాడీల నిరసన



పలమనేరులో అంగన్వాడీల ఆందోళన



కుప్పంలో నెత్తిమీద గుడ్డ వేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

చిత్తూరు, జనవరి 6: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మె శనివారానికి 26వ రోజుకు చేరింది. కుప్పం సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీలు నెత్తిన గుడ్డేసుకుని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీఎం జగన్ తమను నిలువునా ముంచేశారన్న అర్థం వచ్చేలా నెత్తిమీద కొంగు కప్పుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా చిత్తూరులో శనివారం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు నిరవధిక రిలే నిరాహార దీక్షను చేపట్టారు. వీరికి టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్, రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్ మద్దతు పలికారు. 26 రోజులుగా నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అంగన్వాడీల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలమనేరులోని సీడీపీవో కార్యాలయం వద్ద శిబిరంలో నిరసనను కొనసాగించారు. మాట తప్పం, మడమ తిప్పం అని పదేపదే చెప్పే ముఖ్యమంత్రి.. తమ విషయంలో ఎందుకు మాట తప్పుతున్నారో, ఎందుకు మడమ తిప్పారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. పుంగనూరు సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన చేపట్టారు. కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడీలు దీక్ష చేపట్టారు. తమ సమస్యలపై సీఎం జగన్ ఇకనైనా స్పందించాలంటూ నగరిలో మేకకు వినతిపత్రాన్ని అందించారు.

సినీ ఫక్కీలో ఆటోడ్రైవర్ కిడ్నాప్

దాడి చేసి, బలవంతంగా బస్సులోకి తోసి.. విజయవాడకు పయనమైన అయ్యప్ప భక్తులు

అడ్డుకుని, బాధితుడిని విడిపించిన పోలీసులు

శ్రీకాళహస్తిలో కలకలం సృష్టించిన ఘటన

శ్రీకాళహస్తి జనవరి 6: ఓ ఆటోడ్రైవర్‌పై అయ్యప్ప భక్తులు దాడి చేసి, బలవంతంగా బస్సులోకి తోసి.. సినీ ఫక్కీలో కిడ్నాప్ చేశారు. ఈ ఘటన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో కలకలం సృష్టించింది. స్థానికులు పోలీసులు అడ్డుకుని, బాధితుడిని విడిపించి 14 మందిపై కేసు నమోదు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి మండలానికి చెందిన ధర్మేంద్ర శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. మచిలీపట్నానికి చెందిన కొందరు భక్తులు శబరిమల యాత్రకు వెళ్లారు. దీక్ష విరమించాక తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తికి శుక్రవారం రాత్రి చేరుకున్నారు. ముక్కంటి ఆలయ దర్శనానంతరం టూరిస్టు బస్టాండు వద్ద మరో బస్సులోని భక్తులతో మాటామాటా పెరగడంతో వాగ్వాదానికి దిగారు. దీన్ని గమనించిన ఆటో డ్రైవర్ ధర్మేంద్ర వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మచిలీపట్నానికి చెందిన అయ్యప్ప భక్తులు ఆటో డ్రైవర్‌ని దుర్భాషలాడారు. ఆగ్రహించిన ఆటోడ్రైవర్ దగ్గరలోని కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో బస్సు అద్దంపై దాడిచేశాడు. అద్దం ధ్వంసమవడంతో ఆ వాహన డ్రైవర్ విజయవాడకు చెందిన బస్సు యజమానికి ఫోన్‌ద్వారా విషయం తెలిపాడు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ అయ్యప్ప భక్తులు వెంటనే ఆటో డ్రైవర్‌పై దాడి చేశారు. బలవంతంగా బస్సులోకి తోశారు. అక్కడున్న స్థానికులు గమనించి బస్సును అడ్డుకున్నారు. అందుకువారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కె వెళ్లి ఫిర్యాదు చేస్తామని, నమ్మించి బస్సు లో విజయవాడకు బయల్దేరారు. విషయాన్ని అప్పటికే కొందరు స్థానికులు 100కు ఫోన్‌చేసి.. పోలీసులకు తెలియజేశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక కూడా ఎంతసేపటికీ బస్సు పోలీస్‌స్టేషన్ వద్దకు రాకపోవడంతో వన్‌టౌన్ సీఐ అంజుయాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. బస్సు నెంబరు ద్వారా పోలీసులు సంబంధిత వాహన యజమాని వివరాలు గుర్తించి, ఫోన్లో సంప్రదించారు. 'ఆటో డ్రైవర్‌ను వదిలే ప్రసక్తే లేదు.. ఏం చేస్తారో చేసుకోండి. నేను అధికార పార్టీ నాయకుడిని' అంటూ ఆ యజమానికి పోలీసులకు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత ఆటోడ్రైవర్ సెల్‌ఫోన్ ఆధారంగా బస్సు.. పొదలకూరు వద్ద వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులను అప్రమత్తం చేసి ఆ బస్సును అడ్డుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తి పోలీసులు పొదలకూరు చేరుకుని, ధర్మేంద్రను విడిపించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం శనివారం వేకువజామున శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయ్యప్ప భక్తులతోసహా బస్సును శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు కాకుండా కొందరు అధికార పార్టీ నేతలు ఫోన్ల ద్వారా అధికారులపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అయినా 14మందిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి.. బస్సును ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజ్‌లో పెట్టారు.


చికిత్స పొందుతున్న ధర్మేంద్ర

చంద్రబాబు ఇంటికి సంక్రాంతి ముస్తాబు


నారావారిపల్లెలో ముస్తాబవుతున్న చంద్రబాబు ఇల్లు

చంద్రగిరి, జనవరి 6: మాజీ సీఎం చంద్రబాబు తన కుటుంబీకులతో కలిసి సంక్రాంతి పండగకు స్వగ్రామమైన నారావారిపల్లెకు రావడం ఆనవాయితీ. వీరితోపాటు నందమూరి కుటుంబీకులు కూడా వస్తున్న విషయం తెలిసిందే. దాంతో నారావారిపల్లెలోని ఆయన ఇంటిని ముస్తాబు చేస్తున్నారు. ఇంటికి పెయింటింగ్ వేసి, ఆవరణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దుతున్నారు. చంద్రబాబు తల్లిదండ్రుల సమాధులు, కులదైవం నాగాలమ్మ ఆలయం, గ్రామ దేవతల వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. పార్కింగ్, భద్రతా సిబ్బంది ఉండటానికి టీటీడీ కళ్యాణ మండపంలో పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా టీటీడీ కళ్యాణమండపం, అతిథిగృహాన్ని ముందుగా బుక్ చేశారు.

మీ చీర వద్దంటే పెన్షన్ తీసేస్తారా!

- సర్దార్ మృతికి ఎమ్మెల్సీ భరత్‌దే బాధ్యత
- టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఖాదర్‌బాషా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

కుప్పం, జనవరి 6: ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభపెడుతూ చీరలు తాయిలాలుగా పంచడమేకాక, ఆ చీరను వద్దన్న వారికి పెన్షన్ తీసేస్తారా? అని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా వైసీపీ నేతలను నిలదీశారు. తనమాట వినలేదన్న కారణంతో పెన్షన్ కట్ చేసి సర్దార్ మృతికి ఎమ్మెల్సీ భరత్ బాధ్యులయ్యారని ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా వస్తున్న పెన్షన్‌ను వైసీపీ నాయకుల మాటలు వినలేదన్న కారణంతో హఠాత్తుగా కట్ చేసి ఆయన బాధతో గుండె పోటుకు గురై మరణించడానికి కారణమయ్యారన్నారు. కుప్పం ప్రజలు రెండు నెలల్లో రాబోయే ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాలకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జాకీర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి రఫీక్‌లు పాల్గొన్నారు.

బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలి

- సెక్టోరల్ అధికారులకు డీఆర్వో రాజశేఖర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 6: సార్వత్రిక ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర అధికంగా ఉంటుందని డీఆర్వో రాజశేఖర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఆర్డీవోలు, మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్, సెక్టోరల్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై ఒక్కరోజు శిక్షణా తరగతులు జరిగాయి. శిక్షణా తరగతులను ప్రారంభించిన డీఆర్వో మాట్లాడుతూ ఈనెల 22న ఓటర్ల తుదిజాబితా విడుదల చేస్తామని చెప్పారు. సెక్టోరల్ అధికారులు, బీఎల్వోలు ఎన్నికల నిబంధనలను అనుసరించి బాధ్యతలు నిర్వహించాలని అన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు బీఎల్వోల పాత్ర అత్యంత ప్రాధాన్యమైనదని తెలిపారు. సెక్టోరల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మ్యాపింగ్ చేసుకుని కమ్యూనికేషన్ వ్యవస్థ, పోలీసులతో కలిపి శాంతిభద్రతల నివేదిక తయారుచేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక భద్రతకోసం నివేదికలు అందించాలన్నారు. ఈవీఎంల పట్ల అవగాహన పెంచేందుకు, మరింత పోలింగ్‌శాతం పెంచేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరి ఆర్డీవో సృజన, చిత్తూరు ఏఎస్వో సుందర్‌రాజన్‌లు శిక్షణ ఇవ్వగా, ఆర్డీవోలు మనోజ్ కుమార్ రెడ్డి (పలమనేరు), శ్రీనివాసులు (కుప్పం), ఎన్నికల సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం


ధ్వంసమైన కొబ్బరిచెట్టు

కల్లూరు, జనవరి 6: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లి సమీపంలోని పంటలను శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. చంద్రబాబుకు చెంది న మిరప, అలసంద పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు కొబ్బరిచెట్లను విరిచేశాయి. ఇదే గ్రామానికి చెందిన ధర్మేంద్ర, మల్లికార్జున, కృష్ణయ్య మామిడిచెట్లను విరిచేశాయి. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

తప్పుకదా గోవిందా..!

అధికార పార్టీ స్టిక్కర్‌తో తిరుమలకు వచ్చిన కారు


మఠం ముందు అధికార పార్టీ స్టిక్కర్‌తో కారు

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ వైసీపీ స్టిక్కర్‌తో ఉన్న కారు శనివారం తిరుమలలో కనిపించింది. సాధారణంగా రాజకీయ పార్టీ జెండాలు, గుర్తులు, వ్యక్తుల ఫొటోలతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి తనిఖీల్లోనే భద్రతా సిబ్బంది గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. అయితే ఏపీ 02 ఏపీ 3699 నెంబరు గల కారుపై సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను ఉంచి తిరుమలకు తీసుకువచ్చారు. కారును తిరుమలలోని పరకాలస్వామి మఠం వద్ద పార్కింగ్ చేసి వెళ్లారు. నిబంధనలను ఉల్లఘించినా టీటీడీ భద్రతా సిబ్బంది మాత్రం ప్రశ్నించకుండా మౌనంగా ఉండిపోవడం గమనార్హం. ఈ ఘటనతో అలిపిరిలో తనిఖీలపై కూడా విమర్శలు వచ్చాయి.

అధికారంలోకి రాగానే 'సూపర్ సిక్స్' అమలు

- మాజీ మంత్రి అమరనాథరెడ్డి


మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, జనవరి 6: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయనున్నట్లు మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. నాలుగున్నరేళ్ల వైసీపీ అరాచక పాలనకు స్వస్తిపలికి మన రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ఆయన నాగిరెడ్డిపల్లెలో మీడియాతో మాట్లాడుతూ జగన్ అనాలోచిత నిర్ణయాలవల్ల భావి తరాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మరోసారి వైసీపీకి అవకాశం కల్పిస్తే ప్రజల ఆస్తులు కూడా పోగొట్టుకునే దుస్థితి ఏర్పడుతుందన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయంపై వారిలో చైతన్యం కల్పించేందుకు జయహో బీసీ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో లారీ బోల్తా


ప్రమాదానికి గురైన లారీ - గాయపడిన డ్రైవర్ శంకర్

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో శనివారం ఓ లారీ బోల్తా పడింది. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లలో భాగంగా సెట్టింగు కోసం వినియోగించిన వస్తువులను ఏపీ 03డీ 7625 నెంబరు మినీ లారీలో ఎక్కించి తిరుపతికి బయల్దేరారు. 26వ మలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. డ్రైవర్ తిరుపతికి చెందిన శంకర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

72 మంది టీడీపీ నేతలకు స్టేషన్ బెయిల్


నోటీసులు తీసుకున్న టీడీపీ నేతలు

శాంతిపురం, జనవరి 6: అరెస్టు అయిన 72 మంది టీడీపీ నేతలకు శనివారం స్టేషన్ బెయిల్ మంజూరైంది. ఆ నేతలకు రాళ్ళబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో 41 నోటీసులు ఇచ్చి సంతకాలు తీసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అరెస్టుకు నిరసనగా గత సంవత్సరం సెప్టెంబరు 10న శాంతిపురంలో టీడీపీ నేతలు ధర్నా చేపట్టి, బంద్ చేశారు. అప్పుడు హెడ్ కానిస్టేబుల్ పరమేశు విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు మేరకు రాళ్ళబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి పోలీసులు 41 నోటీసులు ఇచ్చారు.

భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు

చౌడేపల్లె,జనవరి6: తన భర్త మృతి అనుమానాస్పదమని ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ వాసు పేర్కొన్నారు. శనివారం అయన మాట్లాడుతూ స్థానిక నాయునివారి పాళ్యంలో నివాసమున్న విశ్రాంతి జవాన్ సి.మురళి(38)కి, పెద్దపంజాణి మండలానికి చెందిన సంపూర్ణతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. మురళి మిలటరీలో పని చేస్తూ కొంతకాలం కిందటే రిటైర్ అయ్యారు. ఈ క్రమంలో భార్య భర్తలు మనస్పర్థలతో కొన్ని సంవత్సరాలుగా విడిగా ఉంటున్నారు. మురళి నాయునివారిపాళ్యంలో తల్లిదండ్రులతో కలిసి ఉండగా భార్య సంపూర్ణ పంజాణి మండలంలో విడిగా ఉంటోంది. ఈ క్రమంలో మురళి శనివారం ఉరేసుకుని మృతి చెందాడని కుటుంబీకులు సంపూర్ణకు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. వెంటనే ఆమె చౌడేపల్లెకు చేరుకుని భర్త మృతదేహాన్ని పరిశీలించి తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులుకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్రాంతికి 233 అదనపు బస్సులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 6: సంక్రాంతిని పురస్కరించుకుని ప్రధాన నగరాలకు అదనంగా 233 ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. ● 10, 11, 12 తేదీల్లో హైదరాబాదుకు 15, బెంగళూరుకు 40, చెన్నైకి 17, విజయవాడకు 11, ఇతర మార్గాలకు 55 ● 15, 16, 17 తేదీల్లో హైదరాబాదుకు 16, బెంగళూరుకు 1, చెన్నైకి 16, విజయవాడకు 8, ఇతర మార్గాలకు 10 బస్సుల చొప్పున ఉన్నాయి.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి

కల్లూరు, జనవరి 6: మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధ్యమని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, శాస్త్రవేత్త రాఘవేంద్ర తెలిపారు. పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లోని మామిడి రైతులకు ఉద్యానశాఖ అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి పూతకు ముందు రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన పూత ఆలస్యంగా వస్తుందన్నారు. కొమ్మలు కత్తిరించడం, దున్నడం చేయకుండా మామిడి తోటలకు విశ్రాంతి ఇస్తే పూత త్వరగా వచ్చే అవకాశం ఉందన్నారు. మామిడిలో తెగుళ్ల, చీడపీడలను గుర్తించి సకాలంలో నివారించాలన్నారు. పూత, పిందె, కాయ దశలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూత సమయంలో తేనెమంచు, తామరపురుగు, ఆకుచుట్టు, పూతచుట్టు తదితర పురుగులు చెట్లపై లేకుండా చూసుకుంటే ఆశించిన దిగుబడి వస్తుందన్నారు. పురుగు మందులను వాడేటప్పుడు ఒకే రకం మందులు మళ్లీమళ్లీ వాడకుండా మార్చుకుంటూ పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, రొంపిచెర్ల జడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రాణెమ్మ, ఉద్యానశాఖ అధికారిణి సంతోషికుమారి, మండల ఏఓ శ్రీనివాసులు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాణి విద్యాశ్రమంలో ముగ్గుల పోటీ



పలమనేరు, జనవరి6 : పలమనేరు వాణి విద్యాశ్రమంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య



పలమనేరు, జనవరి6: పలమనేరు జాతీయరహదారిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు మోటరుసైకిళ్ల స్టాండు వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ మోటరు సైకిళ్ల నిలిపి వేయడం వలన ప్రజలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్లేందుకు కూడా వీలుకాని విధంగా మోటరు సైకిళ్ళు పార్కింగ్ చేస్తున్నారు. గతంలో పోలీసుస్టేషన్, సబ్‌ట్రెజరీ కార్యాలయం ఉన్న సువిశాల ప్రాంతంలో మోటరు సైకిళ్ళు పార్కింగ్ చేసేవారు. అయితే ఈ పార్కింగ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో ద్విచక్రవాహనాదారులు జాతీయ రహదారిపైనే మోటరు సైకిళ్ల నిలిపి వేస్తున్నారు. ఈ స్థలానికి సమీపంలోనే ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే దారిలో అన్న క్యాంటీన్ ఉన్న ప్రదేశం మోటరు సైకిళ్ల స్టాండుకు కేటాయిస్తే ఈ సమస్య తీరుతుందని స్థానికులు అంటున్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి : బీజేపీ

కుప్పం, జనవరి 6: త్వరలోనే జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ప్రతినాయకుడు, కార్యకర్తా సిద్ధం కావాలని భారతీయ జనతాపార్టీ కుప్పం అసెంబ్లీ ఇన్‌ఛార్జి జి.శివశంకర్ పిలుపునిచ్చారు. కుప్పంలో శనివారం నాలుగు మండలాలకు సంబంధించిన బీజేపీ పదాధికారులు, మోర్చా నాయకులు, యువ నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలాలవారీగా ఎన్నికలకు కార్యకర్తలు, సమాయత్తం కావాలని, తప్పనిసరిగా పార్టీ తరఫున గట్టి పోటీ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎ.తులసీనాథ్, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండల అధ్యక్షులు వడివేలు, రామచంద్రుడు, నాశీనాథ్, వెంకటేశ్‌లు, ఓబీసీ మోర్చా జిల్లా నాయకుడు గజేంద్ర, ఇంద్రన్, శక్తివేలు, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు ఇవ్వాలి

పలమనేరు, జనవరి6 : మినిమం టైం స్కేలు ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డివిజన్ శాఖ స్థానిక ఎస్‌టీఓకు వినతి పత్రం అందజేసింది. డిసెంబరు నెల జీతాలకు సంబంధించి గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట, రామకుప్పం, పెద్దపంజాణి మండలాల్లో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులకు జనవరి1వ తేది జీతాలు వారి వారి ఖాతాలకు జయ అయ్యాయన్నారు. అయితే పలమనేరు మండలంలో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులకు నేటి వరకు జీతాలు చెల్లించలేదన్నారు. ఇందుకు కారణాలు తెలియరాలేదన్నారు. భవిష్యత్తులో ఇటువంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు ఎస్‌టీఓకు వినతి పత్రం అంజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సోమచంద్రారెడ్డి, ఏఆర్ కుమార్, రోషన్ ఆల్లీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన దీక్ష



పలమనేరు, జనవరి6 : పలమనేరు మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం మున్సిపల్ కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు వారు తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని కోరుతూ నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు మద్దెల సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస జీతం నెలకు రూ. 26 వేలు చెల్లించాలని, టైం స్కేల్ వర్తింపజేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఉద్యోగ విరమణ చేసే కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ కార్యాక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, జాన్ ఆనంద్, రమేష్ బాబు, ఎం. బాలాజి, వై. బాబు, బి.వెంకటేసు, ఆర్.వాసు, సురేష్, ఎం.ఆనంద్, అంజి తదితరులు పాల్గొన్నారు.

మామిడి మొక్కలు నరికేశారని ఫిర్యాదు

చౌడేపల్లె, జనవరి6:మామిడి మొక్కలు నరికేశారని ఓ రైతు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు... మండలంలోని కేతనపల్లెకు చెందిన బాలసుబ్రహ్మణ్యంకు కొంత డీకేటీ భూమి ఉంది. సుమారు 15 ఏళ్లనుంచి ఆ భూమిని ఆయన సాగు చేసుకుంటున్నాడు. ఆ భూమిలో ఏడాది క్రితం 600 మామిడి మొక్కలు నాటుకున్నాడు. ఈక్రమంలో ఆయన సమీప బంధువు వెంకటరమణ శనివారం సుమారు 200 మామిడి మొక్కలను నరికేశారన్నారు. నరికేసిన మామిడి మొక్కలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా మామిడి మొక్కలు నాటిన భూమి ఎవరికి పట్టాలేదని, ప్రభుత్వం భూమి కావటం గమనార్హం.

తెలుగు సాహిత్యంపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న విశ్రాంత అధ్యాపకుడు రెడ్డెప్పరెడ్డియాదవ్

పుంగనూరు, జనవరి6: విద్యార్థులు తెలుగు సాహిత్యంపై పట్టు సాధించాలని విశ్రాంత అధ్యాపకుడు రెడ్డెప్పరెడ్డియాదవ్ పేర్కొన్నారు. శనివారం బసవరాజ ప్రభుత్వ బాలుర కాలేజీ ఆవరణలో శ్రీకృష్ణదేవరాయల తెలుగు సాహిత్య విజ్ఞాన వేదిక సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు సాహిత్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిభాష తెలుగును వదిలి పరభాష ఆంగ్లంపై పిల్లలు మక్కువ చూపడం సరికాదన్నారు. విశ్రాంత హెచ్‌ఎం వెంకటపతి మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల కాలం సాహితీ వైభవాన్ని వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయకుమారి, బసవరాజ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వసుంధర, సంస్థ ప్రతినిధులు మునిస్వామినాయుడు, గంగులమ్మ, జీవీ.రమణ, నూకల జయరామిరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

పుంగనూరు రూరల్, జనవరి 6: భీమగానిపల్లె సమీపంలోని బైపాస్ క్రాస్‌లో ఏర్పాటు చేసిన కృష్ణదేవరాయుల విగ్రహాన్ని మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి ఆవిష్కరించనున్నట్లు బలిజసంఘ యువజన నాయకులు తెలిపారు. కార్యక్రమానికి బలిజ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

నమ్మి ఓటేస్తే జగన్ నిలువునా ముంచేశాడు



శాంతిపురంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు , కుప్పంలో విరాళాల సేకరణ, బైరెడ్డిపల్లెలో అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కుప్పం, జనవరి 6: ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలను నమ్మి ఓటేస్తే సీఎం అయ్యాక నెత్తిమీదికి గుడ్డ తెచ్చారని అంగన్వాడీలు విమర్శించారు. కుప్పంలో అంగన్వాడీల దీక్ష శనివారంనాడు కొనసాగింది. సీఎం జగన్ తమను నిలువునా ముంచేశాడన్న అర్థం వచ్చేలా నెత్తిమీద కొంగు కప్పుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం జగన్ హామీలు గుల్లయిపోగా తమకు అడుక్కోవాల్సిన గతి పట్టిందంటూ హుండీతో పాదచారుల వద్ద పోరాటం కొనసాగించడానికి అవసరమైన విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు లలిత, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు మాట్లాడుతూ ఎన్నికల ముందు వేతనాలు పెంచుతామని, ఇతర సదుపాయాలు కల్పిస్తామని జగన్ ఎన్నో హామీలిచ్చారని గుర్తు చేశారు. నాలుగున్నరేళ్లలో ఈ ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. హామీలు అమలు చేయమంటూ రోజులతరబడి సమ్మె చేస్తున్నా, ఆందోళనలు కొనసాగిస్తున్నా సీఎంకు చీమకుట్టినట్లు కూడా లేదని ధ్వజమెత్తారు. ఆరునూరైనా డిమాండ్లు సాధించి తీరుతామని ప్రతిన బూనారు.

శాంతిపురం: సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శనివారం టెంటులో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రామకుప్పం, శాంతిపురం అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెలో అంగన్వాడీల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంవద్ద నిరసన దీక్షలోవున్న అంగన్వాడీలకు శనివారం కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌గౌడు, ఇనాయతుల్లా, రమణప్ప, ధనంజయగౌడు తదితరులు మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు.

పలమనేరు : పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శనివారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ కోర్కెల సాధన కోసం చేపట్టిన ఆందోళనను 26వ రోజు కూడా కొనసాగించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమపై వేధింపులకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల ముందు అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా రూ. 1000 జీతం పెంచుతామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు నెరవేర్చకపోవడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గిరిధరగుప్తా, రాధ, చిలకమ్మ, గాయత్రి, నీరజ, సుమ, లక్ష్మి, హిందు, సరస్వతి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బీసీలకు వైసీపీ ద్రోహం : టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కుప్పం, జనవరి 6: బీసీలకు వైసీపీ తీరని ద్రోహం చేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మునిరత్నం మాట్లాడుతూ అధినేత చంద్రబాబు ప్రజా చైతన్య సభలకు ప్రజలు వెల్లువెత్తుతున్నారన్నారు. వైసీపీకి నూకలు చెల్లాయని, అది ఇంటికి పోవడం ఖాయమన్నారు. బీసీ కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ ధ్యేయంగా చేసుకున్నారని విమర్శించారు. గుడుపల్లె మండలం మల్లేపల్లె వద్ద టీడీపీ హయాంలో పరిశ్రమలకోసం కేటాయించిన భూమిని వైసీపీ నేతలు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాగే గుడివంక దగ్గరి భూములను కూడా కబ్జా చేయడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు. గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీలందరూ టీడీపీ వెనుకే ఉన్నారన్నారు. బీసీలకు వైసీపీ ప్రభుత్వ హయాంలో వివిధ రూపాలలో రూ.75 వేల కోట్ల నష్టం జరిగిందన్నారు. నామినేటెడ్ పదవులన్నీ రెడ్లకే ఇచ్చుకున్నారని, రాష్ట్రంలో సుమారు 30 వేల ఎకరాలనుంచి 40 వేల ఎకరాల దాకా బీసీల భూములు కబ్జా అయ్యాయని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్ల ఎవరికీ పట్టకుండా దుస్థితిలో కొనసాగుతున్నాయన్నారు. జయహో బీసీ సభలతో టీడీపీకి తిరిగి ఊపిరినివ్వడానికి టీడీపీ సిద్ధమైందని గుర్తు చేశారు. శాంతిపురం మండలం సోగడబల్ల గ్రామంలో సర్దార్ బాషా పింఛన్ కట్ చేసి ఆయన మృతికి ఎమ్మెల్సీ భరత్, వైసీపీ నాయకులే కారణమయ్యారని ఆరోపించారు. చనిపోయిన తర్వాత వేలిముద్ర తీసుకుని పించను ఇవ్వడం వారి నైచ్యాన్ని తెలియజేస్తోందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి పి.గోపీనాథ్, ఆర్ఆర్.రవి, మంజునాథ్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి : గౌనివారి

శాంతిపురం, జనవరి 6 : గ్రామస్థాయిలో వర్గ విభేదాలను పక్కన పెట్టి పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో పంచాయతీ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, బూత్ కన్వీనర్లు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలకు కేవలం రెండు నెలలు మాత్రమే ఉందని, అందుకు గ్రామ స్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. ఓటర్ల వెరిఫికేషన్ మరో సారి చూసుకోవాలన్నారు. బూత్‌ల వారీగా పార్టీ సానుభూతుపరులను గుర్తించి వారు ఏ కమ్యూనిటీకి చెందినవారో రాయాలన్నారు. అది కేవలం అంచనాకు మాత్రమేనన్నారు. బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఈనెల 10వ తేది లోపు పూర్తి చేయా లన్నారు. బాబు ష్యూరిటీ కరపత్రాలు అందించి టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సూపర్ 6 పథకాలను చున్నాంగా వివరించాలన్నారు. చంద్రబాబు లక్ష ఓట్లు మెజారిటీ రావాలంటే ప్రతి ఒక్కరూ పని చేస్తేనే అనుకున్న లక్ష్యం చేరుకోగలమన్నారు.తరువాత కొంతమంది పంచాయతీ పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో ఉన్న నేతల మధ్య సమన్వయం లోపించిందని, అలాంటి పంచాయతీలను గుర్తించి మండల, నియోజకవర్గ స్థాయి నేతలు సర్దుబాటు చేయాలన్నారు. దీనిపై అధిష్టానం దృష్టి తీసుకు వెళ్లి సరిచేస్తామని వారికి నేతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉదయకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జిలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్ఎస్ మణి, గోపాల్, ఎల్.జయరామిరెడ్డి, నారాయణ స్వామి,బాలు,భాస్కర్, ఆంజనేయరెడ్డి, నేతలు ఏఎంసీ నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి పీవీనాగరాజు, ఉయ్యాల జయరామిరెడ్డి పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కావాలంటే చంద్రబాబు సీఎం కావాలి



మాగాండ్లపల్లెలో మాట్లాడుతున్న చల్లా బాబు

పుంగనూరు రూరల్, జనవరి6: యువతకు ఉపాధి కావాలంటే చంద్రబాబు సీఎం కావాలని ఎదురు చూస్తున్నట్లు పుంగనూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి చెప్పారు. శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పుంగనూరు మండలం మాగాండ్లపల్లె, ఏడూరు, బరిణేపల్లె, ఏటవాకిలి, ప్రసన్నయ్యగారిపల్లె తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలతో ప్రజలను బెదిరిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేయించి జైలుకు పంపుతున్నారన్నారు. జరగబోవు ఎన్నికలో టీడీపీ, జనసేన అభ్యర్థుల గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్, మాధవరెడ్డి, ఆసూరి బాలాజీ, సీవీరెడ్డి, గిరి, రెడ్డెప్పనాయుడు, శ్రీనాథరెడ్డి, వెంకటేశ్, శేఖర్, రమణ, పాలరమణ, బాలకృష్ణ, నాగరాజ, మోహన్‌రెడ్డి, జనసేన నాయకులు పగడాల రమణ, చైతన్యరాయల్, విరూపాక్షి, నరేశ్‌రాయల్, సుబ్బు, హరినాయక్, బాలాజీ నాయక్, మురళినాయక్, గణేశ్, పవన్, వెంకటేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

పుంగనూరు, జనవరి6: స్థానిక ఎంఎస్ఆర్ థియేటర్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం ప్రోత్సాహక బహుమతులను మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల దేహదారుఢ్యం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్లు అర్షద్‌అలీ, అమ్ము, నరసింహులు, హెచ్‌ఎంలు సుబ్రహ్మణ్యం, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

శాంతిపురం, జనవరి 6 : మండల ఎస్టీయూ డైరీ, క్యాలెండర్, వజ్రోత్సవ వేడుకల పోస్టరును ఆ యూనియన్ నేతలతో కలిసి ఎంఈవో-2 గోవిందు రాజులు ఆవిష్కరించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు వెంకట్ అందరికి డైరీలు, క్యాలెండర్లు పంపిణీ చేశారు. యూనియన్ నేతలు రాధాకృష్ణ, ఆనంద్, గోపి, లక్ష్మీపతి, ప్రభాకర్, మహేష్‌బాబు, ఎస్టీయూ నేతలు ప్రదీప్, ప్రహసిత్, శ్రీనివాసయాదవ్, రమణప్ప, జగదీష్, శివశంకర్, రఘురామ్, గిరిబాబు, మహిళా నాయకురాలు గాయత్రి, వాణి, రాధ, మంజుల, తేజస్విని, మహేశ్వరి, ఉషారాణి, ముబారక్, నాగేంద్రి, సోని, పద్మావతి, గౌరి, కస్తూరి పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బైరెడ్డిపల్లె, జనవరి 6 : అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. బైరెడ్డిపల్లెలో శనివారం జరిగిన పింఛన్ల పంపిణీ సభలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ రూ.3వేలకు పెంచారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రెడ్డెమ్మ, ఎంపీపీ రెడ్డెప్ప, జడ్పీటీసీ కేశవులు, వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కొంగనపల్లె మాజీ సర్పంచ్ రంగారెడ్డి మృతి



రామకుప్పం, జనవరి 6: కొంగనపల్లె మాజీ సర్పంచ్ రంగారెడ్డి శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. గతంలో ఆయన కాంగ్రెస్ మద్దతుదారుగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన వైసీపీలో కొనసాగారు. ఎమ్మెల్సీ భరత్, వైసీపీ కన్వీనర్ విజలాపురంబాబు, కోకన్వీనర్ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఎన్నికల ముందే బిల్లులు చెల్లించండి



ట్రాన్స్‌కో అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

వి.కోట, జనవరి 6: మూడు నెలల్లో ఎన్నికలు రానున్నాయని, ఆలోపు మండల పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని పీఆర్ అధికారులకు ఎంపీపీ యువరాజ్ సూచించారు. శనివారం జరిగిన మండల మీట్‌లో నాశిరకం విత్తనాల విక్రయాలపై వ్యవసాయ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. తోటకనుమలో ప్రవహిస్తున్న కైగల్ నదిలో నీటిని తోడుకునేందుకు రైతులకు అవసరమైన విద్యుత్ సర్వీసులు ఇవ్వాలని సభ్యులు కోరారు. వికోట సీహెచ్‌సీలో రోగుల తాకిడి ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వం ఇస్తున్న మందులు సరిపడటం లేదని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి మందుల సరఫరా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓగు పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు తమీంఖాన్, లక్ష్మణ్‌రెడ్డి, తహసిల్దార్ చిట్టిబాబు, ఎంపీడీవో మహ్మద్ రఫీ, సీఐ లింగప్ప, ఇతర అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని ఆదరించండి



మేకలనాగిరెడ్డిపల్లెలో అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, జనవరి6: రాష్ట్రాభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ టీడీపీని ఆదరించాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి కోరారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శనివారం చీలంపల్లె, నాగిరెడ్డిపల్లె, మిట్టపల్లె, మర్రిమానుచేను, మూల తిమ్మేపల్లె, ధర్మపురి, తూర్పుగడ్డ, పిచ్చిగుండ్లపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రం అధ్వానంగా తయారైందని విమర్శించారు. పిచ్చిగుండ్లపల్లెలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి అమరనాథరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, నాయకులు రామచంద్రనాయుడు, నాగభూషణం, మంజునాథరెడ్డి, షౌకత్‌అలి, అమరనాథ రెడ్డి, భువనచంద్రగౌడు, మోహన్‌రెడ్డి, గౌరప్ప, నాగరాజు, అరుణ్‌గౌడు, బాబు, చలపతి, హరి, జనసేన నాయకులు పసుపులేటి దిలీప్, చైతన్యకుమార్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

పుంగనూరు రూరల్, జనవరి6: వివాహేతర సంబంధాలతో భర్త వేదిస్తున్నాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్ప తెలిపారు. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన సయ్యద్‌బాషా కుమారుడు అల్లాబక్షుతో పట్టణంలోని హైస్కూల్‌వీధికి చెందిన షాహీనాతో 2021లో వివాహం జరిగింది. అప్పటి నుంచి అల్లాబక్షు పుంగనూరులోనే కాపురం ఉన్నాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. మరో మహిళతో వివాహేతర సంబందాలు ఏర్పాటు చేసుకుని ప్రతి రోజు వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇళ్లస్థలాల కోసం జేసీకి వినతి

రామకుప్పం, నవరి 6: రామకుప్పం మండలం మిట్టపల్లె గ్రామస్తులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని శనివారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును జడ్పీటీసీ నితిన్‌రెడ్డి కలసి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 5-1లో పేదలకు ఇళ్లస్థలాలు అందజేయాలని తహసీల్దార్‌కు ఆయన ఆదేశాలు జారీ చేసినట్లు నితిన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ రామిరెడ్డి, వార్డు సభ్యులు సుధామధు, నేతలు మధు, రవి, పవన్, శేషాద్రి ఉన్నారు.

కేఈసీకి న్యాక్-ఏ గ్రేడ్

కుప్పం, జనవరి 6: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్-ఏ గ్రేడ్ లభించింది. న్యాక్ బృందం రెండు రోజుల పాటు కేఈసీలో పర్యటించింది. కళాశాలలో విద్యావిధానాలు, సాధిస్తున్న ఫలితాలు, అధ్యాపకులు, పరిశోధనా విభాగాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించింది. అనంతరం కేఈసీకి సీజీపీఏ 3.22 స్కోర్‌తో న్యాక్ -ఏ హోదా ఇచ్చేందుకు ఆమోదముద్ర వేసింది. కేఈసీకి న్యాక్ -ఏ గ్రేడ్ గుర్తింపుకోసం కృషి చేసిన ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, న్యాక్ కో ఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్అండ్‌డీ డైరెక్టర్ జీఎన్.కోదండరామయ్య, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులను బీసీ. నాగరాజ్‌తోపాటు వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్, సీఈవో ఎన్.సాగర్‌రాజ్ అభినందించారు.

నంజంపేట వద్ద సారా స్వాధీనం

సోమల, జనవరి 6: నంజంపేట సమీపంలో నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు జరిపి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. అలాగే 1500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చిన్న ఉప్పరపల్లె, ఆవులపల్లెలో పోలీసులు సోదాలు జరిపారు.

సోమలలో క్రికెట్ టోర్నీ

సోమల, జనవరి 6: సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో స్వర్గీయ పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన తనయుడు సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఉత్సాహం చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ఎంపీపీ ప్రభాకర్, ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్లు మోహన్, నాగేశ్వరరావు, రమణయ్య, ఎంపీటీసీ సభ్యులు నాగభూషణం రెడ్డి, హరినాథ్, జయరాం, నిర్వాహకులు షావలీ పాల్గొన్నారు.

శివాలయం రాయల్స్ క్రికెట్ టోర్నీ

సోమల, జనవరి6: సోమల హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 12నుంచి సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ. 30,000, ద్వితీయ బహుమతి రూ. 15,000, తృతీయ బహుమతి రూ. 5వేలు, అలాగే షటిల్ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి రూ5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ వెయ్యి, ఎంట్రీలకు 90003835, 9542438847 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో సామాజిక తనిఖీలు

సోమల, జనవరి 6: మండలంలోని ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ చేపట్టారు. శనివారం ఇరికిపెంట ప్రాథమికోన్నత పాఠశాలలో వంటనిర్వాహకులతో మెనూ వివరాలు సేకరించారు. విద్యార్థులతో భోజన పథకం అమలుపై ఆరాతీశారు. అలాగే వడ్డిపల్లె, ఎర్రనాగులపల్లె, మేటిమంద పాఠశాలలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ నాగరాజ, ఏపీవో దినకర్‌బాబు, హెచ్‌ఎంలు శోభారాణి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి చికిత్స శిబిరం

చౌడేపల్లె, జనవరి6: స్థానిక హైస్కూల్‌లో 1978-79 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థుల ఆధ్వర్యంలో ఈనెల 7న ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించనున్నారు. వారు మాట్లాడుతూ.. స్థానిక హైస్కూల్‌లో గత 15ఏళ్లుగా శంకర్ కంటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉచిత కంటి చికిత్స శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటుసారా తాగితే అనారోగ్యంపాలే...

పుంగనూరు రూరల్, జనవరి 6: నాటుసారా తాగడం వల్ల అనారోగ్యం పాలవుతూ అనేక ఇబ్బందులు తప్పవని చిత్తూరు ట్రైనీ ఏఈఎస్ శ్రీరామ్ వివరించారు. శనివారం పుంగనూరు మండలం పట్రపల్లె తాండా, పెద్దతాండా, నల్లగుట్లపల్లె తాండాల్లో నాటు సారా అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా సేవించడం వల్ల అవయవాలు దెబ్బతింటాయని, మానసిక రోగాలు వస్తాయని తెలిపారు. నాటు సారా విక్రయాలు చేస్తే కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

13న బీసీవైపీ ధర్మపోరాట సభ



పుంగనూరు రూరల్, జనవరి6: ఈనెల 13వతేది పుంగనూరు మండలం చదళ్లలో బీసీవైపార్టీ ఆధ్వర్యంలో జరిగే ధర్మపోరాట సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కొత్తయిండ్లులోని బీసీవైపార్టీ అధినేత రామచంద్రయాదవ్ స్వగృహంలో ధర్మపోరాట సభ పోస్టర్లను పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్.హరినాథరెడ్డి, హరిబాబుయాదవ్, నదుం విశ్వనాథరెడ్డిలు ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు కిరణ్, వెంకటేశ్, ఉత్తన్న, నారాయణస్వామి, ధనంజయ, సత్య పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

పుంగనూరు రూరల్, జనవరి6: కర్ణాటక మద్యం విక్రేతను అరెస్ట్ చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కేశవరాజు తెలిపారు. ఎంసీపల్లె పంచాయతీ పట్రపల్లెకు చెందిన వెంకట్రమణనాయక్ పట్రపల్లె బస్టాండ్ వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కృత్రిమ కాలు కోసం ఆర్థిక సాయం

పలమనేరు, జనవరి6 : పలమనేరు మండలం మొరం పంచాయతీ కురప్పల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త సౌందర్‌రాజన్‌కు అనారోగ్య కారణంగా కుడికాలు డాక్టర్లు తొలగించారు. అతనికి కుడి కాలుకు కృత్రిమ కాలు అమర్చుకోనేందుకు గాను టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి రామచంద్రనాయుడు శనివారం సౌందర్‌రాజన్ ఇంటికి వెళ్లి రూ. 25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సౌందర్‌రాజన్ కుటుంబ సభ్యులు రామచంద్రనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కుప్పం, జనవరి 6: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ విద్యాసాగర్ అన్నారు. కుప్పంలో శనివారం నూతనంగా వచ్చిన పెన్షన్ దారులకు మూడువేలు రూపాయలు పెంచిన పించన్లను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సీఎం జగన్ మూడు వేలు పెన్షన్ ఇచ్చి మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఎంపీపీ అశ్విని, జడ్పీటీసీ ఏడీఎస్.శరవణ, విద్యాసాగర్, మురుగేశ్ పాల్గొన్నారు.

బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

- న్యాయమూర్తి విష్ణువర్మ



సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి

నగరి, జనవరి 6: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని నగరి మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి విష్ణువర్మ పేర్కొన్నారు. శనివారం నగరి పట్టణ పరిధిలోని మండపం సమీపంలో గల గార్మెంట్స్ కంపెనీలో నిర్వహించిన బాలకార్మిక నిర్మూలన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ దుకాణాల్లో, చిన్న కంపెనీల్లో బాల కార్మికులను పనిలో ఉంచుకుంటే యజమానులపై చర్యలు తీసుకోవడమే గాక కేసు నమోదు చేసి శిక్ష వేయడం జరుగుతుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మనివాసకం, ధరణి, చిరంజీవులుశెట్టి, ఎం.బాబు, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీలంటే చులకనా....?

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, జనవరి 6: బీసీలను నట్టేట ముంచిన జగన్‌మోహన్ రెడ్డిని గద్దె దింపుతాం... రా... కదలిరా... నా బీసీల్లారా అని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ పిలుపునిచ్చారు. శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ టీడీపీకి వెన్నెముకగా వున్న బీసీలను మోసం చేసిన ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా అన్యాయంచేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అయ్యారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వంలో నలుగురు రెడ్లు మాత్రమే బాగుపడ్డారని ఎద్దేవా చేశారు. బీసీల్లారా కదలిరండి... టీడీపీకి పట్టం కట్టండి... బీసీలను అన్నివిధాలా తెలుగుదేశంపార్టీ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, నేతలు కమల్‌నాథ రెడ్డి, ధరణి నాయుడు, రమేష్, కోకా ప్రకాష్ నాయుడు, హేమచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట తెలుగుయువత నిరసన

చిత్తూరు సిటీ, జనవరి 6: కలెక్టరేట్ ఎదుట తెలుగు యువత ఆధ్వర్యంలో ఈ నెల 8న సోమవారం శాంతియుత నిరసన తెలుపుతున్నట్లు తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కాజూరు రాజేష్ చెప్పారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతియేటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని సీఎం జగన్ ఎన్నికలముందు హామీ ఇచ్చారని చెప్పారు. కాగా మాట తప్పి, మడమ తిప్పారని విమర్శించారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలంటూ సోమవారం ఉదయం 10.30 గంటలకు శాంతియుత నిరసన తెలపనున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో తెలుగుయువత నేతలు మంజు, యువరాజ్, దిలీప్ నవీన్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పేటమిట్టలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



గోమాతకు పూజచేస్తున్న గల్లా అరుణకుమారి

పూతలపట్టు, జనవరి 6: మండలంలోని పేటమిట్ట గ్రామంలో రూ.5 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న కోదండరామస్వామి ఆలయ ఆవరణంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా 47 అడుగుల పొడవు, సుమారు రెండు టన్నుల బరువు ఉన్న ధ్వజస్తంభాన్ని రంగంపేట క్రాస్ వద్ద వున్న గల్లా ఫుడ్స్ నుంచి పేటమిట్ట గ్రామానికి భారీ వాహనంలో తీసుకెళ్తుండగా, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన ధ్వజస్తంభ ఊరేగింపు శనివారం ఉదయం పేటమిట్టకు చేరుకుంది. అనంతరం వేదపండితులు సాంప్రదాయ ప్రకారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజా బ్యాటరీస్ వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు, గల్లా రాజగోపాల్ నాయుడు, స్థానిక సర్పంచ్ గల్లా రాధాకృష్ణ, రామా నాయుడు, సంపత్ నాయుడు, భానుమూర్తి నాయుడు, జయరాం నాయుడు, గ్రామస్తులు, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే శుక్రవారం, శనివారం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

గురజాలను సన్మానించిన టీడీపీ బీసీ నేతలు



చిత్తూరు సిటీ, జనవరి 6: టీడీపీ సీనియర్ నేత, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడును టీడీపీ బీసీ నేతలు జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'జయహో బీసీ' కార్యక్రమం ప్రచారం కోసం రెండు వాహనాలను జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ తరపున ఏర్పాటు చేశారు. ఈ ప్రచార వాహనాలు 50 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా తిరిగి బీసీ సామాజిక వర్గ ప్రజలను చైతన్య పరుస్తాయి. వాహనాలను ఏర్పాటు చేసినందుకు చెన్నకేశవులు నాయుడును బీసీ నేతలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే ఫౌండేషన్ ఛైర్మన్ గురజాల జగన్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు కృష్ణమూర్తి, ధరణి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

పెనుమూరు, జనవరి 6: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని కలవగుంట, కలిగిరి సచివాలయాల పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందలేని వారికి పథకాలను అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. ఇవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, ఏఇ పవన్‌కుమార్, ఏవో మీనాకుమారి, వ్యవసాయ అధికారి కళ్యాణ్‌బాబు, డీడీవోలు శేషు, లావణ్యలతో పాటు సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పరిచయ వేదిక'ను విజయవంతం చేయండి

శ్రీరంగరాజపురం, జనవరి 6: బెంగళూరులో సోమవారం జరగబోయే గంగాధరనెల్లూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ పరిచయ వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి డాక్టర్ రావెల లోకేష్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

నగరి, జనవరి 6: నగరి మండల పరిధిలోని తెరణి గ్రామ పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నా యకులు టీడీపీ లో నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రకాష్ సమక్షంలో చేరారు. చంద్రబాబు సేవ లు, టీడీపీ మ్యానిఫెస్టోకు ఆకర్షితులమై టీడీపీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు.పెరియస్వామి, ఏలుమలై, సుందర్, శ్రీనివాసన్‌తో పాటు పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. తెరణి పంచాయతీకి తన శాయశక్తులా సహాయం చేస్తానని భానుప్రకాష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు శివకుమార్ రెడ్డి, కార్యదర్శి పురుషోత్తం నాయుడు, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నేతలకు టీడీపీ కండువా కప్పుతున్న భానుప్రకాష్

మద్యం స్వాధీనం: ఇద్దరి అరెస్టు

బంగారుపాళ్యం, జనవరి 6: మండలంలోని కాటప్పగారిపల్లె, నలగాంపల్లె వద్ద శనివారం ఎస్ఈబీ అధికారులు విస్తృతంగా జరిపిన దాడుల్లో కాటప్పగారిపల్లెకు చెందిన జయరామయ్యను అదుపులోకి తీసుకుని, అతడి వద్ద 65 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా శాంతి అనే మహిళను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద 35 కర్ణాటక టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



కళాకారులతో కోలాటం ఆడుతున్న డిప్యూటీ సీఎం

పాలసముద్రం, జనవరి 6: పాలసముద్రం ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పెంచిన పింఛన్లను డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేతులమీదుగా శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామల శివప్రకాష్ రాజు, జడ్పీటీసీ అన్బు, ఎంపీడీవో రామనాథ రెడ్డి, తహసీల్దార్ బాబు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో కోలాటం కళాకారులతో కలిసి నారాయణస్వామి కోలాటం ఆడి సందడిచేశారు.

నింద్రలో...

నింద్ర, జనవరి 6: నింద్ర ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పెంచిన పింఛన్లను మంత్రి రోజా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, మండల ప్రత్యేకాధికారి సతీష్‌కుమార్, ఎంపీడీవో అరుణ, తహసీల్దార్ భగవతి, కో-ఆప్షన్ సభ్యులు అనిల్, ఎంపీటీసీ విజేష్, సర్పంచ్ బాబురెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి మేరీ, నేతలు వేణురాజు, దామోదరం, మునికృష్ణారెడ్డి, వీరయ్య, రామచంద్రారెడ్డి, రామచంద్రయ్య, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు

చిత్తూరు, జనవరి 6: నగరంలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్లలో ఉండి 10వ తరగతి తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై శనివారం స్థానిక లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో ప్రేరణ తరగతులను నిర్వహించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత తరగతులు నిర్వహించారు. సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకుని విద్యలో రాణించాలని కోరారు. అనంతరం పరీక్ష సామగ్రిని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో నాగేశ్వర రావు, వార్డెన్‌లు శ్రీకాంత్, ఏకాంబరం, మురళి, సులోచన, అన్నపూర్ణ, త్రివేణి, ఈశ్వరమ్మలు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు థామస్ పరామర్శ



శ్రీరంగరాజపురం, జనవరి 6: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లెమిట్ట టీడీపీ నేత చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి కొత్తపల్లె రమేష్‌ను గంగాధర నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్, ఎస్ఆర్‌పురం మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని కొంత ఆర్థిక సహాయం చేసిన డాక్టర్ థామస్ టీడీపీ తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు స్వామిదాస్, శ్రీధర్ యాదవ్, గుండయ్య, చంద్రబాబు నాయుడు, గురునాథం, గుణశేఖర్, సతీష్, లోకేష్, స్టాలిన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు రావాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్జాల అరుణ

పెనుమూరు, జనవరి 6: రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలన్నా, ప్రజలు సంక్షేమంతో జీవించాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ అన్నారు. శనివారం ఆమె మండలంలోని ఉగ్రాణంపల్లి, మోపిరెడ్డిపల్లి గ్రామాల్లో గడప గడపకు వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఇప్పుడు ఉన్న పరిస్థితులను వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతు నాయుడు, గిరి, చంద్రకళ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఈవో వెంకటేశు

ఐరాల (కాణిపాకం), జనవరి 6: కాణిపాక క్షేత్రంలోని ఆస్థాన మండపంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో కంటి, చెవి పరీక్షలతో పాటు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతికి చెందిన హోస్టర్ నారాయణాద్రి హాస్పెటల్, వాసన్ ఐ కేర్ వారు సంయుక్తంగా నిర్వహించారు. ఈవో వెంకటేశు, ఏఈవో ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, డాక్టర్ సాయికుమార్, క్యాంపు ఇన్‌చార్జి వెంకటేష్ పాల్గొన్నారు.

రాముడి అక్షతలకు ప్రత్యేక పూజలు

నింద్ర, జనవరి 6: నింద్ర మండలం కూనమరాజుపాళెం మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం అయోధ్యరాముడి అక్షతలను పంపిణీ చేశారు. సమరసతా సేవా ఫౌండేషన్, మండల బీజేపీ కార్యకర్తల ఆధ్వర్యంలో మహాలక్ష్మి ఆలయంలో అక్షతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలచే గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గీతామందిర ఆశ్రమం పీఠాధిపతి ఆధ్వర్యంలో నిర్వహించగా, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గుత్తా నారాయణస్వామి నాయుడు, జిల్లా కార్యదర్శి రమేష్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కడియాల బాలకృష్ణ, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కరపత్రాల పంపిణీ

విజయపురం, జనవరి 6: మండలంలోని మల్లారెడ్డి కండ్రిగ ఆదిఆంధ్రవాడలో బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని జనసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు గోవర్ధన్, మునికృష్ణ, ఓంశంకర్, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

● ఒంటికాలిపై నిరసన తెలిపిన మున్సిపల్ కార్మికులు



ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

చిత్తూరు, జనవరి 6: ప్రభుత్వం మొద్దునిద్ర వీడి మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్ డిమాండ్ చేశారు. చిత్తూరు మున్సిపాలిటీ వద్ద సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేపట్టిన సమ్మె శనివారంతో నాలుగోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది అధికారులు ఉన్నతాధికారుల మెప్పు పొందడంకోసం సమ్మెను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అలాంటి ఆలోచనలను మానుకోవాలని చెప్పారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయకపోతే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. అనంతరం కార్మికులు ఒంటికాలిపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● పేరుకుపోతున్న చెత్త నిల్వలు



టెలిఫోన్‌కాలనీలో నిండిపోయిన చెత్త

చిత్తూరు నగర ంలో కార్మికుల సమ్మె కారణంగా చెత్త నిల్వలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. కార్మికులు నాలుగు రోజులుగా సమ్మెలో ఉండటంతో ప్రత్యామ్నాయంగా అధికారులు వందమంది దినసరి కూలీలను తీసుకున్నారు. సుమారు 300 మంది సమ్మెలో ఉండటంతో అధికారులు తీసుకున్న వందమంది కార్మికులు పూర్తిస్థాయిలో చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించలేకపోతున్నారు. వాణిజ్య సముదాయాలు, కూరగాయలు, చేపల మార్కెట్లు, జన సంచారం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే పనులు చేస్తున్నారు. కాలనీల్లో చెత్త సేకరణ జరగడం లేదు. దీంతో దోమల బెడద అధికమయ్యే ప్రమాదంతో పాటు దుర్వాసన వెదజల్లే అవకాశం ఉంది.



వీధులను ఊడుస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్, శివకుమార్

వీధులను శుభ్రంచేసిన కార్పొరేటర్లు

మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరంలోని పెనుమూరుక్రాస్‌లో కార్పొరేటర్ శ్రీకాంత్, స్థానిక ప్రముఖుడు దళవాయి శివకుమార్, చెన్నకేశవరెడ్డి చీపుర్లు పట్టి వీధులను శుభ్రం చేశారు. 43వ వార్డు కార్పొరేటర్ వెంకటరమణ వీధులను శుభ్రం చేయడంతో పాటు వ్యర్థాలను లోడింగ్ చేశారు. 42వ డివిజన్‌లో కార్పొరేటర్ శశికుమార్ యువతతో కలిసి వీధులను శుభ్రంచేశారు. సీప్యాక్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు రాంబాబు, ముత్యాలమ్మగుడి వద్ద అయ్యప్పస్వాములు, వీధులను శుభ్రం చేశారు.

డొక్కు బస్సులతో ప్రయాణికుల అగచాట్లు



మరమ్మతులకు గురై ఆగిపోయిన బస్సు

పాలసముద్రం, జనవరి 6: చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సులు తరచూ మరమ్మతులకు గురై ఎక్కడపడితే అక్కడే ఆగిపోతున్నాయి. ఈ మార్గంలో చిత్తూరు-2 డిపో బస్సులు నడుస్తున్నాయి. శనివారం ఉదయం చిత్తూరులో బయలుదేరిన బస్సు రామలింగాపురం వద్ద గేర్ బాక్సు మరమ్మతులకు గురవ్వడంతో ఆగిపోయింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డొక్కు బస్సులు కావడంతో తరచూ మరమ్మతులకు గురై గమ్యస్థానం చేరుకుంటామో లేదోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో కండీషన్‌లో ఉండే బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని మంచి కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నగరిలో ఆర్టీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

నగరి, జనవరి 6: నగరిలో ఆర్టీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్, ఏఐటీయూసీ నాయకులు శనివారం నగరిలో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ జిల్లా విభజన తర్వాత 15 కిలోమీటర్ల దూరంలో వున్న ఆర్టీఓ కార్యాలయాన్ని 75 కిలోమీటర్ల దూరంలో వున్న చిత్తూరుకు తరలించడంతో సమస్యలు తప్పడం లేదన్నారు. నగరి, నింద్ర, విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాలో ఉంచి వడమాలపేట, పుత్తూరు మండలాలను తిరుపతిలో చేర్చడంతో చిత్తూరు ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. నగరిలో ఆర్టీఓ కార్యాలయం ఏర్పాటుచేయాలని, అలా కాకుంటే వారానికి ఓ రోజైనా నగరిలో ఆర్టీఓ కార్యాలయ పనులు జరిగేలా చూడాలని వినతి పత్రం అందించారు.

క్రమబద్ధీకరణ పేరిట వైసీపీ భూదందా

- వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీడీపీ, జనసేన ఆందోళన



ఆందోళన చేస్తున్న టీడీపీ, జనసేన పార్టీ నాయకులు

వెదురుకుప్పం, జనవరి 6: డీకేటీ భూముల క్రమబద్ధీకరణ పేరిట రెవెన్యూ, వైసీపీ నాయకులు చేస్తున్న అక్రమ భూదందాను అరికట్టాలని కోరుతూ శనివారం వెదురుకుప్పంలో ర్యాలీ, నిరసన కార్యక్రమాలు జరిగాయి. తెలుగుదేశంపార్టీ కార్యాలయం నుంచి ఆ పార్టీ మండలాధ్యక్షుడు కామసాని లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు బైఠాయించి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్ మాట్లాడుతూ భూమి క్రమబద్ధీకరణలో నియమ నిబంధనలను తుంగలో తొక్కి, దళారీలు చెప్పిన వాళ్లకు వైసీపీ నాయకులు, కార్యకర్తలకు భూమి హక్కు కల్పిస్తున్నారని ఆరోపించారు. తప్పిదాలకు పాల్పడితే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలను టీడీపీ, జనసేన సంయుక్తంగా ముట్టడిస్తాయని హెచ్చరించారు. టీడీపీ వాణిజ్య విభాగం జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఇతరుల అనుభవంలో ఉన్న భూములను మరొకరికి ఇవ్వడానికి లంచాలు తీసుకుని సిద్ధమయ్యారని ఆరోపించారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రబాబురెడ్డి పాతగుంట గ్రామంలో గ్రామ కంఠం భూమిని అనర్హుడుకి ఇవ్వడానికి సన్నద్ధమయ్యారని అన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామికి తెలిసే అక్రమాలు జరుగుతున్నాయని, తెలిసినా పట్టించుకోవడంలేదన్నారు. అనంతరం ఉప తహసీల్దార్లు ఆర్.జయంత్‌కుమార్, కోమలకు వినతి పత్రమిచ్చి ఆందోళనను విరమించారు.

ఒకే బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి పంపాలి

● టీడీపీ నేతలు దొరబాబు, చంద్రప్రకాష్

● కలెక్టరేట్ వద్ద నిరవధిక రిలే దీక్ష చేపట్టిన అంగన్వాడీలు



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు, జనవరి 6: బటన్ నొక్కి సంక్షేమ పథకాలను బ్యాంకు ఖాతాలకు వేస్తున్నానని ప్రజలను మోసం చేస్తున్న సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఒకే బటన్ నొక్కి ఇంటికి పంపాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్ పిలుపునిచ్చారు. ప్రాజెక్టు కార్యాలయాల వద్ద సమ్మె చేపట్టిన అంగన్వాడీ వర్కర్లు శనివారం కలెక్టరేట్ వద్ద నిరవధిక రిలే నిరాహార దీక్షను చేపట్టారు. అంగన్వాడీలకు టీడీపీ నేతలు మద్దతుపలికి మాట్లాడారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిస్తామని బెదిరింపులకు గురిచేయడం సరికాదని అంగన్వాడీ యూనియన్ నేతలు షకీల, ప్రభావతి, జ్యోతి, సుజనీలు హితవుపలికారు. నిరవధిక రిలే నిరాహార దీక్షలో చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల మండలాలకు చెందిన అంగన్వాడీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మేకకు అంగన్వాడీల వినతి

నగరి, జనవరి 6: మూగజీవిలాంటి జగన్‌మోహన్‌రెడ్డీ... ఇకనైనా కళ్లు తెరువు అనే రీతిలో నగరి అంగన్వాడీ కార్యకర్తలు శనివారం మేకకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అనంతరం కోలాటం ద్వారా తమ నిరసన వ్యక్తం చేశారు. 26 రోజులుగా మహిళలు రోడ్డెక్కి ధర్నా చేస్తుంటే ముఖ్యమంత్రి స్పందించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంసీఏ ఫస్టు సెమిస్టర్ ఫలితాల్లో విజయం విద్యార్థుల ప్రతిభ



పూర్ణిమ, ధనుషా, చరిష్మా, గౌతమి, ఫరోజియా, నవీన్‌కుమార్

చిత్తూరు (సెంట్రల్), జనవరి 6: ఎస్వీయూ విడుదల చేసిన ఎంసీఏ మొదటి సంవత్సర ఫలితాల్లో స్థానిక విజయం బిజినెస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధిక జీపీఏ సాధించిన విదార్థుల్లో ఎం.పూర్ణిమ (8.43జీపీఏ), పి.ధనుషా (8.29), పి.చరిష్మా, పి.గౌతమి (8.24), సయ్యద్ అఫ్రిన్ జాహా (8.06), పి.నవీన్‌కుమార్ (8.03) ఉన్నారు. పరీక్షలకు హాజరైన వారిలో 8.75 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి, ప్రిన్సిపాల్ కె.జయంతి, అధ్యాపకులు శ్రీనివాసన్, రఘురామ్, దినకర్, కవిత, చంద్రమౌళిలు అభినందించారు.

రోబోటిక్స్‌లో బృందావన్ విద్యార్థుల సత్తా



రోబోటిక్స్‌లో విజేతలైన బృందావన్ విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 6: తమిళనాడు వేలూరు జిల్లా వీఐటీలో శనివారం నిర్వహించిన రోబోటిక్స్-2024లో స్థానిక బృందావన్ విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ శైలజాకుమారి తెలిపారు. దేశవ్యాప్తంగా రెండు వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, బృందావన్ నుంచి ఐదుగురు విద్యార్థులు వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించగా, నలుగురు విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. గెలుపొందిన వారిలో ఎస్వీ ఉజ్వలేశ్వరీ (4వ తరగతి), దర్శన్ చౌదరి (6వ తరగతి), వినీల్, సూర్యనారాయణ (8వ తరగతి) ఉన్నారని తెలిపారు. రోబోటిక్స్ పరీక్షల్లో 56 మంది విద్యార్థులకు గాను 14 మంది విజేతలుగా నిలవగా, 18 మంది రన్నరప్‌గా నిలిచి బహుమతులు పొందారని తెలిపారు. వీరిని వీఐటీ వైస్ ప్రెసిడెంట్ సెల్వం, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

భూ యాజమాన్య చట్టంపై రాజకీయ పార్టీలు స్పందించాలి

చిత్తూరు కల్చరల్, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రెవెన్యూ అధికారులకు లబ్ధి చేకూరే విధంగా ప్రవేశపెట్టిన భూయాజమాన్య చట్టానికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు స్పందించాలని హ్యూమన్ డెమొక్రటిక్ పార్టీ వ్యవస్థాపకులు యం.శేఖర్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇటీవల జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా ఈ చట్టం పట్ల నిరసన తెలిపారని, అదే విధంగా ఇతర రాజకీయ పార్టీలు కూడా నిరసనలు తెలియజేయాలని ఆయన కోరారు.

గ్రూప్-2కు కుట్టిస్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

చిత్తూరు (సెంట్రల్), జనవరి 6: నిరుద్యోగ మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్) అభ్యర్థులకు గ్రూప్-2 పరీక్షలకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ సీఈడీఎం విజయవాడ ఆధ్వర్యంలో స్థానిక కుట్టీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆర్‌కే పవనకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల పాటు ఇచ్చే శిక్షణకు గ్రూప్-2 దరఖాస్తు, ఆధార్ కార్డు, బియ్యం కార్డు, కుల, ఆదాయ, టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమో, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 10వ తేదీలోపు స్థానిక మిట్టూరులోని రాఘవ థియేటర్ సమీపంలో గల కుట్టీస్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని తెలిపారు. కోచింగ్‌తో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్, పరీక్షల బుక్‌లెట్ అందించనున్నట్లు తెలిపారు.

డైట్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



ముందస్తు సంక్రాంతి వేడుకల్లో డైట్ శిక్షణార్థులు

కార్వేటినగరం, జనవరి 6: కార్వేటినగరం ప్రభుత్వ డైట్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా డైట్ శిక్షణార్థులు సంక్రాంతి వేడుకలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపక బృందం కూడా పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు న్యాయం

బంగారుపాళ్యం, జనవరి 6: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. శనివారం మండలంలోని తుంబకుప్పంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. మురళీ మాట్లాడుతూ దళితులందరూ రాబోవు ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టి గెలిపించాలని, అధికారంలోకి రాగానే తుంబకుప్పంలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ యిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, నేతలు కమల్‌నాథ రెడ్డి, ధరణి నాయుడు, రమేష్, హేమచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు అభివృద్ధిపై నేతలను నిలదీయండి

● చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు

చిత్తూరు సిటీ, జనవరి 6: చిత్తూరు నగర అభివృద్ధిపై ఓట్ల కోసం వచ్చే రాజకీయ నేతలను నిలదీయాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు పిలుపునిచ్చారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ 100 ఏళ్ళకు పైగా చరిత్ర కలిగిన చిత్తూరు నగరం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం ప్రజలు పోరాడాలని చెప్పారు. అనంతరం నగర అభివృద్ధికి అవసరమైన ప్రధాన డిమాండ్లతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. తాండవమూర్తి, శోభారాణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మేల్‌మరువత్తూర్ యాత్రకు 16 ఉచిత బస్సులు

చిత్తూరు సిటీ, జనవరి 6: గుడిపాల మండలం నరహరిపేటలో ఓం శక్తి భక్తులు మేల్‌మరువత్తూర్ యాత్రకు వెళ్ళిరావడానికి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 16 ఉచిత బస్సులను ఏర్పాటుచేశారు. శనివారం రాత్రి నగరంలోని దుర్గానగర్ కాలనీలో ఓం శక్తి భక్తులు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం, ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. అనంతరం బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఫౌండేషన్ ఛైర్మన్ గురజాల జగన్మోహన్‌కు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సైకోపాలనకు చరమగీతం పాడుదాం: టీడీపీ

నగరి, జనవరి 6: రాష్ట్రంలో సైకోపాలనకు చరమగీతం పాడుదామని నగరి టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం నగరి పట్టణ అధ్యక్షులు రమేష్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచకాలను ఎండగడుతూ చంద్రబాబు చేపట్టిన రా.. కదిలిరా అనే కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించిందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌రెడ్డి, గుణశేఖర్, బీపీ ఆర్ముగం, శ్రీధర్, అల్లిముత్తు, కన్నయ్య, నారాయణస్వామి నాయుడు, చిత్తూరు బాబు నాయుడు, నాయకులు పాల్గొన్నారు.